క్లుప్తంగా

వరిలో కలుపు కష్టాలు



వరిలో కలుపు తీస్తున్న కూలీలు

విజయపురం: ఇటీవల కురుస్తున్న వర్షాలతో వరి రైతులను కలుపు కష్టాలు వెంటాడుతున్నాయి. మండలంలోని ఎక్కడ చూసినా పంట పొలాల్లో విపరీతమైన గడ్డి పెరిగింది. కలుపుతీతకు పెద్ద సంఖ్యలో కూలీల అవసరం ఏర్పడుతోంది. మరో వైపు కూలి ధర, కూలీల కొరత రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు కలుపును తొలగించేందుకు రసాయనిక మందులను పిచికారీ చేస్తున్నారు. రసాయన మందులు పిచికారీ చేయడం ద్వారా రైతుకు పెట్టుబడి భారంగా మారుతోంది.

ఆంక్షలున్నా ఆగని రసాయనాలు



కాలువల్లో ప్రవహిస్తున్న రసాయనాల నీరు

నగరి: ఎన్ని ఆంక్షలు పెట్టినా, ఎన్ని నిబంధనలు పెట్టినా, ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినా, కాలుష్య నియంత్రణ మండలి పరిశీలన చేపట్టినా, స్థానిక అధికారులు హెచ్చరికలు జారీ చేసినా, ప్రజా సంఘాలు ఉద్యమాలు చేసినా, సంక్షేమ సంఘాలు నిరసనలు వ్యక్తం చేసినా ఏదీ కాలువల్లో ప్రవహించే హానికర రసాయన రంగు నీటిని ఆపలేకపోతున్నాయి. మేమింతే.. మారమంతే అంటూ డైయింగ్ యూనిట్లవారు కాలువల్లో హానికర రసాయనాలను వదులుతూనే ఉన్నారు. అధికారులు దీనికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఏం చేస్తే రసాయన నీటిని కట్టడి చేయగలమో అనే అన్వేషణలోనే నగరి జనం కాలం గడిపేస్తున్నారు.

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి



స్టాక్‌ని అడిగి తెలుసుకుంటున్న వీఆర్‌ఓ

పాలసముద్రం: ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులకు పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ అరుణ కుమారి తెలిపారు. సోమవారం తహశీల్దార్ ఆదేశాల మేరకు శ్రీకావేరిరాజుపురం చౌకదుకాణాన్ని వీఆర్‌ఓ తంగరాజ్ తనిఖీ చేశారు. వీఆర్‌ఓ తంగరాజ్ మాట్లాడుతూ నిత్యావసర సరుకులు నిర్ణీత సమయంలో ప్రతి రేషన్‌కార్డుల లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ముఖ్యంగా తూకాల్లో తేడాలు లేకుండా డీలర్లు చూడాలని తెలిపారు. అనంతరం నిత్యావసర సరుకుల స్టాక్ రికార్డులను తరవుగా పరిశీలించారు. కార్యక్రమంలో డీలర్ సుబ్రమణ్యానాయుడు పాల్గొన్నారు.

యోగాంధ్రకు తరలిరండి

పెనుమూరు(కార్వేటినగరం): యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కలసి రావాలని ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల తహశీల్దార్ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. జూన్ 2వ తేదీ మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పర్యాటక కేంద్రమైన పులిగుండు వద్ద సుమారు వెయ్యిమందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు వినియోగించుకోండి



మొబైల్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న హరిత

పుత్తూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ హరిత సూచించారు. సోమవారం స్థానిక రాస్ కార్యాలయంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన, జన్‌ధన్ యోజన, అటల్ పింఛన్ యోజన, ఆయుష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి యోజన పథకాలను వివరించారు. ప్రతి ఒక్కరూ పథకాలకు సంబంధించి త్వరితగతిన రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం పథకాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేసి, మొబైల్ వ్యానును జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పుత్తూరు, నగరికి చెందిన 80 మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌రెడ్డి, రవి, నాగేంద్ర, తేజ తదితరులు పాల్గొన్నారు.

పేర్లు తొలగించినా.. కీర్తి చెరగదు

- శిలాఫలకాలపై పేర్లు తొలగించినా.. నిలిచిపోయిన అభివృద్ధి
- చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం
- రాజకీయ స్ఫూర్తి ప్రశ్నార్థకం
- అభివృద్ధిలో కానరాని పోటీతత్వం

నగరి: ఒక క్రీడాకారుడు వంద పరుగులు చేస్తే అతన్ని అభినందించి అతనికంటే ఎకుకవ పరుగులు చేయాలన్న తాపత్రయాన్ని చూపే స్ఫూర్తి క్రీడల్లో కనిపిస్తుంది. అలాంటి స్ఫూర్తి రాజకీయాల్లో కనిపించడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి ఆర్కే రోజా చేపట్టిన అభివృద్ధి పనులకు వేసిన శిలాఫలకాలపై అతికించిన స్టిక్కర్లు తీసివేయడం, పేర్లను చెరిపివేయడం, శిలాఫలకాలు పగలగొట్టడం ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. శిలాఫలకాల్లో పేర్లు తీసేస్తే అభివృద్ధి చేసినవారు మరుగున పడిపోతారనుకోవడం అవివేకమని విశ్లేషకుల అభిప్రాయం. పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, అభివృద్ధి ఎంత చేశామనేదే ముఖ్యమని తెలుపుతున్నా రు. అభివృద్ధి పనులు భవిష్యత్తు తరాలకు చి హ్నాంగా నిలబడాలిగానీ శిలాఫలకాలపై ప్రతాపం చూపే అనారోగ్యకర రాజకీయాలకు స్వస్తి పలకాలంటున్నారు.

అభివృద్ధికి కొత్త బాట

గత పాలనలో మాజీ మంత్రి ఆర్కే రోజా నియోజకవర్గంలోని నగరి, పుత్తూరు, వడమాలపేట ప్రాంతాల్లో నూతనంగా పార్కులను ఏర్పాటు చేశారు. నగరి, పుత్తూరులోని శ్మశాన వాటికలకు గ్యాస్ బర్నర్‌లు ఏర్పాటు చేయించారు. అగ్రికల్చర్ టెస్టింగ్ సెంటర్, పాలిటెక్నిక్ కళాశాల, ఐటీ కళాశాల,



నగరి పార్కు వద్ద తొలగించి ఉన్న శిలాఫలకం

నగరి ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ సెంటర్లు, షాదీమహల్, మున్సిపల్ కార్యాలయం తదితర ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ అభివృద్ధి పనులకు గుర్తుగా వాటి ప్రారంభోత్సవ సమయంలో శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. 11 నెలల క్రితం ప్రభుత్వం మారింది. అధికార పార్టీకి చెందిన చోటానేతలు ప్రజలకు మరిన్ని అభివృద్ధి పనులు చేయాల్సింది పోయి శిలాఫలకాలపై తమ ప్రతాపం చూపడం మొదలుపెట్టారు. ఆ పనులన్నీ ఎవరు చేపట్టారో తెలియకుండా చెయ్యాలన్న వారి ఆలోచన, పేరు చెరిపేస్తే మరచిపోతారన్న అవివేకం, గతంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని పదేపదే చెప్పుకోవచ్చన్న కుతంత్రం అందులో స్పష్టంగా కనిపించింది. అయితే వాటిని సరిచేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అధికార పార్టీపై ఉన్న భయంతో మీనమేషాలు లెక్కిస్తూ వాటిని అలాగే వదిలిపెట్టారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో శిలాఫలకాలపై అతికించిన కాగితాలు కూడా తూతూ మంత్రంగానే తొలగించారు. దీంతో స్టిక్కర్లు చింపేసిన, పేరుపై మరకలు పూసిన, పాక్షికంగా శిథిలం చేసిన శిలాఫలకాలు ఇంకా అలాగే దర్శనమిస్తున్నారు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది.







నగరిలో పార్కు ప్రారంభించిన మాజీమంత్రి (ఫైల్), పైన అంటించిన కాగితాలు శుభ్రం చేయని శిలాఫలకం, శ్మశాన వాటిక వద్ద పేర్లు తొలగించి ఉన్న శిలాఫలకం

బాల్య వివాహాలను అరికట్టాలి



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం కల్పలత

పాలసముద్రం: బాల్యవివాహాలు, మహిళలపై లింగ వివక్ష చూపడం, గృహ హింస చట్టరీత్యా నేరమని ఐకేపీ ఏపీఎం కల్పలత తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు బాల్య వివాహం, గృహ హింసపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం కల్పలత మాట్లాడుతూ స్త్రీలు, పురుషులకు సమానమని, లింగ వివక్ష చూపకూడదని, బాల్య వివాహాలు చేయరాదని, అది చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల, మహిళలు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి దారుణం

వడమాలపేట (విజయపురం): తిరుపతిలో ఇంజినీరింగ్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌ను కిడ్నాప్ చేసి అత్యంత దారుణంగా హింసించడం దారుణమని, వైఎస్సార్ సీపీ మండల జనరల్ కార్యదర్శి ఉమాపతి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులకు రక్షణ లేకుండాపోయిందన్నారు. తిరుపతిలో దళిత విద్యార్థిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. విద్యార్థి కుటుంబానికి పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: ప్రస్తుతం వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. సోమవారం పీహెచ్‌సీలో ఆయన ఆరోగ్య సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలకు గ్రామాల్లో పలు రోగాలు వచ్చే అవకాసం ఉందన్నారు. అందువలన ఇంటి పరిసరాలను వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిలో దోమలు వృద్ధి చెంది పలురోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో దగ్గు, జలుబు వస్తే అత్యవసర ముందులు అందించాలన్నారు. గ్రామాల్లో ఎక్కువ మందికి దగ్గు, జలుబు, జ్వరం ఉంటే ఆ గ్రామంలో మెడికల్ క్యాంప్ పెట్టాలని తెలిపారు. కార్యక్ర మంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పురుషోత్తం

వెదురుకుప్పం: జూన్ 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. సోమవారం వెదురుకుప్పంలో మండల స్థాయి, సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కమిటీలు వేసుకుని ప్రజలను భాగస్వాములు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయంలో జరిగే యోగా, విశాఖలో జరిగే యోగాంధ్ర లేదా మరెక్కడైనా ఇతర ప్రాంతాల్లో జరిగే యోగా కార్యక్రమానికి హాజరయ్యేలా కృషి చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మందు బాబులకు నిలయంగా బస్టాండు



దుస్థితికి చేరుకున్న కార్వేటినగరం పాత బస్టాండు



బస్టాండు చుట్టూ పిచ్చిమొక్కలు

కార్వేటినగరం: సంస్థానాధీశుల కాలంనాటి నుంచి కార్వేటినగరానికి ఓ ప్రత్యేక ఉంది. కార్వేటినగరం నిత్యం ఉత్సవాల గ్రామంగా విరాజిల్లుతుండడంతో భక్తులకు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా కొన్నేళ్ల క్రితం బస్టాండును నిర్మించారు. అయితే ఈ బస్టాండు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. నిత్యం మందుబాబు ఉండడంతో ప్రయాణికులతోపాటు స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి 7 గంటలైతే చాలు మందు బాబులు నిండి పోవడంతో మహిళలు ఆ మార్గంలో వెళ్లేందుకు భయపడుతున్నారు. బస్సు షెల్టర్ దుస్థితికి చేరుకుని తేలిక పాటి వర్షం వచ్చినా ఉరుస్తోంది. కూర్చోవడానికి నిర్మించిన దిమ్మెలు కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో వృద్ధులు, వికలాంగులకు ఇబ్బందులు తప్పడం లేదు. దుస్థితికి చేరుకున్న బస్టాండును ఆధునీకరించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యోగా భారతీయ సాంప్రదాయం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: భారతీయ సాంప్రదాయాల్లో యోగా ఒక భాగమని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి తెలిపారు. సోమవారం కళాశాలలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శారీరక, మానసిక శక్తుల ఐక్యతే యోగా అని వివరించారు. యోగాతో ఆధ్యాత్మిక వికాసం, జీవన నైపుణ్యాలు అలవాటవుతాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహులు, రఘురామన్, కిషోర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా



మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌మురళి

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్ మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మోహన్‌మురళి మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి సరిపడా కోరం లేకపోవడంతో వాయిదా వేశామన్నారు. ఎంపీపీ సూచనల మేరకు త్వరలో సర్వసభ్య సమావేశం తేదీని నిర్ణయిస్తామని అన్నారు.

ఇది పార్టీ సమావేశం కాదు

సర్వసభ్య సమావేశం ప్రారంభానికి ముందు అధికారులు ఏర్పాటు చేసిన బ్యానర్ వెనుక పసుపు రంగు గుడ్డ ఏర్పాటు చేయడం మంచి పద్ధతి కాదు అని జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి అన్నారు. ఇది టీడీపీ పార్టీ మీటింగ్ కాదు ప్రజాప్రతినిధుల సర్వసభ్య సమావేశమని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాలన్నారు. చెడు సంస్కృతికి అధికారులు దూరంగా ఉండాలన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



శ్యామలకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు

వెదురుకుప్పం: పిడుగు పాటుకు గురై నష్టపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి బుల్లెట్ రవి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బండమీద ఇండ్లు గ్రామంలో ఇటీవల ఇంటిపై పిడుగు పడి నష్టపోయిన బాధితురాలు శ్యామల కుటుంబాన్ని పరామర్శించారు. జరిగిన ఘటనతోపాటు నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థిక సాయం చేశారు. రెవెన్యూ అధికారులు బాధితులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు చక్రవర్తినాయుడు, జిల్లా అధ్యక్షుడు ధనుంజయనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, చంద్రగిరి నియోజకవర్గ చైర్మన్ సుధాకర్ పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా సరఫరా చేయాలి

నగరి: రేషన్ షాపుల్లో సరుకులు సక్రమంగా సరఫరా చేయాలని, తూకాల్లో తేడా రాకూడదని తహశీల్దార్ రవికుమార్ రేషన్ డీలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. పేదలకు సరఫరా చేసే సరుకులు సక్రమంగా అందించాలని ఎక్కడైనా తూకంలో తక్కువ వేస్తున్నారని, కొన్నిరోజులే ఇచ్చి మూసేస్తున్నారని ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. దీనిపై డీలర్లు మాట్లాడుతూ తమకు గోదాము నుంచి ఇవ్వాల్సిన తూకం మేరకు అందిస్తే సరైన తూకంతో ప్రజలకు అందిస్తామన్నారు. దీనిపై తహశీల్దార్ వారికి సమాధానమిస్తూ గోదాము నుంచి సరైన తూకంతో సరుకులు అందేలా తాను చర్యలు తీసుకుంటానన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు

నగరి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం విక్రయించే ప్రకృతి వ్యవసాయ పంటలకు గిరాకీ పెరుగుతోంది. సోమవారం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు రసాయనాలు వాడకుండా పండించిన పంటలను విక్రయానికి తీసుకువచ్చారు. అప్పటికే వాటికోసం వేచివున్న వారు పోటీపడి మరీ వాటిని కొనుగోలు చేసుకున్నారు. దీంతో మళ్లీ పాత సంప్రదాయ సాగు పద్ధతులు వచ్చే సూచనలు కనిపిస్తోందని విశ్లేషకులు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు



సర్పంచ్ తీర్మానం లేకుండా పన్నూరులో వేస్తున్న సీసీ రోడ్డు

విజయపురం: కూటమి ప్రభుత్వ నాయకులు వేస్తున్న సీసీ రోడ్లకు రూల్స్ లేవా అంటూ పన్నూరు సర్పంచ్ కుమార్ అధికారులను ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో టీడీపీ నాయకులు వేస్తున్న సీసీ రోడ్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. సర్పంచ్ తీర్మానం లేకుండా సీసీ రోడ్లు వేస్తున్నారని, అవసరం లేకున్నా సీసీ రోడ్డు వేసి టీడీపీ నాయకులు దోచుకొంటున్నారన్నారు. అధికారులు సైతం రూల్స్ పాటించడం లేదని, టీడీపీ నాయకులు చెప్పిందే రూల్స్ అంటూ వారికి దోచిపెడుతున్నారన్నారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో సీసీ రోడ్డు నిర్మాణంపై పెద్ద ఎత్తున చర్చ జరిగిందని, అయినా అధికారులలో ఎలాంటి మార్పు కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి సారించి సీసీ రోడ్ల నిర్మాణాలపై నిఘా పెట్టి, అవినీతి అక్రమాలను అడ్డుకోవాలని కోరారు.

కమనీయం ద్రౌపదీ కల్యాణం

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు అంకనపల్లి గ్రామం వద్ద వెలసిన శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ద్రౌపదీదేవి అమ్మవారికి కల్యాణం కనులవిందుగా సాగింది. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథ కాలక్షేపం చేపట్టారు. సాయంత్రం ఆలయం ఆవరణలో పెళ్లి పందిరి ఏర్పాటు చేసి, ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగల్యధారణ చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉభయదారులుగా శెట్టివనత్తం గ్రామస్తులు వ్యవహరించారు. ధర్మకర్త లింగారెడ్డి, రఘునాథరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి, వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, ఎంపీపీ సరిత, సర్పంచ్ లక్ష్మమ్మ, జనార్దన్, చంద్రారెడ్డి, దామునాయుడు, ప్రసాద్‌రెడ్డి, మణి, డిసెంబర్‌శెట్టి పాల్గొన్నారు.

సార్లు.. సమయానికి రారు



మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శుల పనితీరు అధ్వాన్నంగా మారింది. సచివాలయం ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించాల్సి ఉన్నా అదంతా పట్టనట్టు ఉదయం సచివాలయానికి హాజరై వెళ్లి పోతున్నారు. మధ్యాహ్నం గంట మోగితే చాలు మండల ఆఫీసులో మీటింగ్ ఉందని, ఆ సార్ పిలుస్తున్నారని, వీసీ ఉందని, ఇలా వివిధ కారణాలతో మండల కార్యాలయానికి చేరుకుంటున్నారు. అక్కడ సాయంత్రం వరకూ కాలక్షేపం చేసి ఇంటికెళ్తున్నారు. ఇక.. మండల కార్యదర్శులు ఏదో ఒక టీ షాపు, హోటళ్లలో కాలక్షేపం చేస్తూ ఇంటికి వెళ్లిపోతున్నారు. దీంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. కొందరు కార్యదర్శులైతే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. –విజయపురం

- సమయ పాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు
- ఫీల్డ్ వర్క్ అంటూ అందుబాటులో ఉండని వైనం
- ఇబ్బందుల్లో ప్రజలు .. పేరుకుపోతున్న సమస్యలు

మండల పరిధిలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు, 12 సచివాలయాలు ఉన్నాయి. అందులో పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. ఉదయం నుంచి ఓ గంటపాటు గ్రామ సచివాలయంలో ఉంటున్నారు. మధ్యాహ్నం అయితే మండల కార్యాలయం లేదా నగరికి చేరుకుంటున్నారు. కొందరైతే సచివాలయానికి వెళ్లినా ఒకరు, లేదా ఇద్దరు తప్ప కార్యదర్శులు ఉండడం లేదని స్థానికులు వాపోతున్నారు. అన్ని తెలిసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం, సాయంత్రం వేళల్లో హాజరు వేయాల్సి ఉంటుంది. కానీ కొందరు పంచాయతీ కార్యదర్శులు మధ్యాహ్నానికే ఇంటికి వెళ్లిపోతున్నారు. మరికొందరు మీటింగులు, వీడియో కాన్ఫరెన్సులు, మండల కార్యాలయంలో పని ఉందంటూ రకరకాల సాకులతో సచివాలయాల నుంచి మెల్లగా జారుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వంలో అధ్వాన్నం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపాలుగా సచివాలయాలు ఆవిర్భవించాయి. ప్రతి సచివాలయంలో గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శితోపాటు వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీష్, సర్వేయర్లు, వీఆర్‌ఓ అందుబాటులో ఉంటారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సచివాలయాలు పనిచేశాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థకు తూట్లు పొడిచి నిర్వీర్యం చేస్తోంది. సచివాలయాల ద్వారా 545 సేవలు ప్రజలకు అందేవి. ప్రస్తుతం కూటమి పాలనలో పరిస్థితులు గందరగోళంగా మారాయి. దీనికి తోడు సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న విమర్శలున్నాయి.

కఠిన చర్యలు తప్పవు

సచివాలయ సిబ్బంది. పంచాయతీ కార్యదర్శులు విధిగా సమయ పాలన పాటించాలి. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలతో గౌరవంగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవు. సచివాలయంలో అధికారులు లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం.

–రాజేంద్ర, ఈఓపీఆర్‌డీ, విజయపురం